సాక్షి రంగారెడ్డి

బుధవారం, 10, మే, 2023



దొంగల ముఠా అరెస్టు

గొర్రెలను, మేకలను అపహరిస్తున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. 8లో▸

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో లక్ష్మీదేవునిపల్లి ప్రాజెక్టు నిర్మాణంపై బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి అఖిలపక్ష నాయకులు, రైతులు, విద్యార్థి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సేవా పతకానికి ఎంపిక



కొత్తూరు: కొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న బాలరాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికయ్యారు. ఇందులో భాగంగా త్వరలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో ఆయన ఉన్నతాధికారుల చేతుల మీదుగా పతకాన్ని అందుకోనున్నారు.

న్యూస్‌రీల్

31 నుంచి బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ పరీక్షలు

షాద్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షలు ఈనెల 31 నుంచి ప్రారంభం అవుతాయని షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కేంద్రం కోఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రవీందర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ డిగ్రీ తృతీయ సంవత్సరం వారికి ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 31 నుంచి జూన్ 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నాలుగో సెమిస్టర్ పరీక్షలు జూన్ 7 నుంచి 15 వరకు, మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండో సెమిస్టర్ పరీక్షలు జూన్ 16 నుంచి 22వ తేదీ వరకు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్షలన్నీ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఈనెల 10వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

పాత పోలీసు కమిషనర్ భవన పునఃనిర్మాణం

పనులను ప్రారంభించిన కొత్వాల్ సీవీ ఆనంద్



భవనాన్ని పరిశీలిస్తున్న సీవీ ఆనంద్

గౌలిపురా: శిథిలావస్థకు చేరిన దక్షిణ మండలం పాతబస్తీ పురానీహవేలిలోని పాత పోలీసు కమిషనర్ భవనం పునఃనిర్మాణ పనులను సీపీ సీవీ ఆనంద్ మంగళవారం అధికారికంగా ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా ఈ భవనంలో దక్షిణ మండలం డీసీపీ కార్యాలయం కొనసాగుతోంది. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన భవనం ఇటీవల కురిసిన వర్షాలకు పైకప్పు కుప్పకూలింది. దీంతో ఇక్కడ కొనసాగిన దక్షిణ మండలం డీసీపీ కార్యాలయం పక్కనే స్పెషల్ బ్రాంచ్ జాయింట్ సీపీ కార్యాలయం భవనంపై అంతస్తులోకి మారింది. ఆరు నెలల్లో భవన మరమ్మతు పనులు పూర్తవుతాయని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. 176 ఏళ్ల నగర పోలీసు చరిత్రకు సాక్షిగా నిలిచిన ఈ హెరిటేజ్ భవనంలో 1920 నుంచి 2002 వరకు పోలీసు కమిషనర్ కార్యాలయం పని చేసింది. 2002లో సీపీ కార్యాలయం బషీర్‌బాగ్ తరలివెళ్లగా.. సీపీ క్యాంపు కార్యాలయంతో పాటు దక్షిణ మండలం డీసీపీ కార్యాలయం పని చేస్తోంది. సిటీ పోలీసు అడ్మినిస్ట్రేషన్ అధికారికంగా పునరుద్ధరణ పనులు ప్రారంభించడంతో సౌత్ జోన్‌లోని పురానీహవేలిలోని కొత్వాల్ కార్యాలయ భవనం త్వరలో కొత్త శోభను సంతరించుకోనుంది. కార్యక్రమంలో ఏసీఈ అర్బన్ గ్రూపు గ్రీన్‌కో డైరెక్టర్ అనిల్ కుమార్, దక్కన్ టెర్రైన్ ఎండీ మీర్ బర్కతుల్లా ఖాన్, అడిషనల్ సీపీ (క్రైమ్స్ అండ్ సిట్) ఆర్.ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి ప్రీ బిడ్డింగ్ విజయవంతం

రెండో దశ అమ్మకానికి 85 ప్లాట్లు

సాక్షి, సిటీబ్యూరో: వరంగల్ హైవేకు అందుబాటులో ఏర్పాటు కానున్న రాచకొండ పోలీస్ కమిషనరేట్ సమీపంలో హెచ్‌ఎండీఏ రూపొందించిన మేడిపల్లి లేఅవుట్ ప్లాట్ల కొనుగోలు పట్ల ఔత్సాహికులు ఆసక్తి చూపారు. మంగళవారం హెచ్‌ఎండీఏ నిర్వహించిన ప్రీబిడ్ సమావేశానికి వందమంది వరకు హాజరై ప్లాట్ల కొనుగోలుకు సంబంధించిన అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మేడిపల్లి లేఅవుట్ లో రెండో దశలో 85 ప్లాట్లను ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించేందుకు హెచ్‌ఎండీఏ ప్రక్రియను ప్రారంభించింది. ఈ ప్రీబిడ్ సమావేశానికి హెచ్‌ఎండీఏ సెక్రటరీ చంద్రయ్య, హెచ్‌ఎండీఏ ఎస్టేట్ ఆఫీసర్ (ఈవో) కిషన్ రావు, మేడిపల్లి తహసీల్దార్ మహిపాల్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ గంగాధర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 7 నుంచి జాతీయ స్థాయి సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ లా కాలేజీలో ఆగస్టులో మూడు రోజుల జాతీయ స్థాయి సదస్సు జరగనుంది. డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా ఆధ్వర్యంలో 75 సంవత్సరాల భారత రాజ్యాంగం సాధించిన ప్రగతి సాధించాల్సిన ఆశయాలు అనే అంశంపై ఆగస్టు 7 నుంచి 9 వరకు జరిగే జాతీయ సదస్సు బ్రోచర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. సదస్సుకు దేశ వ్యాప్తంగా లా విద్యార్థులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, సీనియర్ ప్రొ.జీబీ రెడ్డి, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: లీడర్‌స్కూల్ వద్ద కారుపై విరిగిపడిన చెట్టు



చేవెళ్ల: మల్కాపూర్ బస్ స్టేజీ సమీపంలో రోడ్డుపై విరిగిపడిన మర్రి చెట్టు

గాలివాన బీభత్సం

విరిగిపడిన చెట్లు, చెట్ల కొమ్మలు
- తెగిపడిన విద్యుత్ వైర్లు
- కరెంట్ సరఫరాకు అంతరాయం

చేవెళ్ల: గాలివాన బీభత్సం సృష్టించింది. మండలంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వడగళ్ల వాన కురిసింది. భారీగా వీచిన గాలులకు పలుచోట్ల చెట్లకొమ్మలు, చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లపై చెట్లకొమ్మలు పడడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని మల్కాపూర్ బస్‌స్టేజీ సమీపంలో హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై భారీ మర్రిచెట్టు పడిపోయింది. దీంతో వాహనాలు కిలోమీటర్ల పొడవున నిలిచిపోయాయి. పోలీసులు స్థానికుల సాయంతో జేసీబీని తెప్పించి చెట్టును పక్కకు తొలగించారు. దేవుని ఎర్రవల్లి గ్రామంలోని పంచాయతీ వద్ద ఉన్న ఓ చెట్టు విరిగి కిందపడిపోయింది. లీడర్‌స్కూల్ వద్ద చెట్టు విరిగి అక్కడే పార్కు చేసిన కారుపై పడిపోయింది. గంటపాటు ఏకధాటిగా వర్షం కురిసింది.

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

మొయినాబాద్: అకాల వర్షం, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని పలు గ్రామాల్లో చెట్లకొమ్మలు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వెంకటాపూర్, శ్రీరాంనగర్, సురంగల్, నజీబ్‌నగర్, కాశీంబౌలి, కనకమామిడి, తోలుకట్ట, సజ్జన్‌పల్లి, కేతిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. నజీబ్‌నగర్ వద్ద చెట్లుకొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపోయింది. విద్యుత్ తీగలు, చెట్టకొమ్మలు రోడ్డుపై పడ్డాయి. కాశీంబౌలి సమీపంలో 11 కేవీ విద్యుత్ స్తంభం విరిగిపడింది. తోలుకట్ట, కనకమామిడి గ్రామాల్లోనూ విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బలమైన ఈదురుగాలులు వీయడంతో మామిడికాయలు నేలరాలాయి.



మొయినాబాద్: నజీబ్‌నగర్ వద్ద చెట్టుకొమ్మలు పడి విరిగిన విద్యుత్ స్తంభం

ప్రథమంలో భళా.. ద్వితీయంలో డీలా

ఇంటర్మీడియెట్‌లో మిశ్రమ ఫలితాలు
- మొదటి సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం
- గతంతో పోలిస్తే తగ్గిన ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత శాతం
- ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా అమ్మాయిలదే హవా..
- ఎక్కువ మంది మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలోనే ఫెయిల్



గత ఐదేళ్లలో ఫస్టియర్ రెగ్యులర్ ఫలితాలు

విద్యా సంవత్సరం	పరీక్షకు హాజరైనవారు	ఉత్తీర్ణులుత	శాతం
2018	52,676	38,862	74
2019	54,598	38,794	71
2020	62,456	43,958	70
2021	53,619	32,328	60
2022	56,359	41,056	72
2023	68,289	50,433	73

గత ఐదేళ్లలో సెకండియర్ రెగ్యులర్ ఫలితాలు

విద్యా సంవత్సరం	పరీక్షకు హాజరైనవారు	ఉత్తీర్ణులు	శాతం
2018	8,790	37,452	77
2019	55,863	37,602	67
2020	57,638	41,076	71
2021	55,829	55,829	100
2022	52,265	39,410	75
2023	53,050	38,911	73

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇంటర్మీడియెట్ సెకండ్ ఇయర్ ఫలితాలు జిల్లావాసులను కొంత నిరుత్సాహానికి గురి చేశాయి. గత ఏడాదితో పోలిస్తే కొంత తగ్గడమే ఇందుకు కారణం. ఫస్టియర్ ఫలితాలు గతంతో పోలిస్తే కొంత మెరుగుపడి, రాష్ట్ర స్థాయిలో జిల్లాను రెండో స్థానంలో నిలిపినప్పటికీ..సెకండియర్ ఫలితాలు మాత్రం గతంతో పోలిస్తే కొంత నిరాశ కలిగించాయి. గత ఏడాది మూడో స్థానంలో ఉన్న జిల్లా ఈసారి ఐదో స్థానానికి పడిపోయింది. మెజార్టీ విద్యార్థులు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లోనే ఫెయిల్ అయినట్లు తెలిసింది.

సెకండియర్‌లో తగ్గిన ఉత్తీర్ణత శాతం

సెకండియర్ రెగ్యులర్ కోర్సుల్లో గత ఏడాది ఫలితాలతో పోలిస్తే..ఈ సారి ఉత్తీర్ణత శాతం కొంత తగ్గింది. గత ఏడాది 75 శాతం ఉత్తీర్ణత సాధించి, రాష్ట్ర స్థాయిలో మూడోస్థానంలో నిలిచిన జిల్లా ఈ ఏడాది 73 శాతం ఉత్తీర్ణతతో ఐదో స్థానానికి దిగజారింది. 27,601 మంది బాలురు,25,449 బాలికలు పరీక్షకు హాజరైతే..వీరిలో 19,047 మంది (69శాతం) బాలురు, 19,864 మంది (78 శాతం) బాలికలు ఉత్తీర్ణత సాధించారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా బాలురతో పోలిస్తే బాలికలే తమ హవా కొనసాగించారు. ఇక ఒకేషనల్ కోర్సుల్లో 2,837 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వీరిలో 2,022 మంది ఉత్తీర్ణత (71 శాతం) సాధించారు.

ఫస్టియర్‌లో 73 శాతం ఉత్తీర్ణత

ఫస్టియర్ రెగ్యులర్ కోర్సుల్లో గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ సారి జిల్లాలో ఉత్తీర్ణత శాతం కొంత మెరుగుపడింది. 36,149 మంది బాలురు, 32,140 మంది బాలికలు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 25,333 మంది బాలురు, 25,100 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. బాలురు 70 శాతం ఉత్తీర్ణత సాధిస్తే.. బాలికలు 78 శాతం సాధించారు. ఫస్టియర్ ఒకేషనల్ కోర్సుల్లో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం కొంత మెరుగుపడింది. 1,878 మంది బాలురు, 1,610 మంది బాలికలు పరీక్షకు హాజరు కాగా, వీరిలో 679 మంది బాలురు, 1,153 మంది బాలికలు (52శాతం)ఉత్తీర్ణత సాధించారు.

అడుగడుగునా ఘన స్వాగతం



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క, చిత్రంలో గద్దర్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తదితరులు

- ఉత్సాహంగా సాగిన భట్టి పాదయాత్ర

మీర్‌పేట: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ 54వ రోజు పాదయాత్ర మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ నుంచి మంగళవారం ఉదయం ప్రారంభమైంది. ముందుగా జిల్లెలగూడ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్ర మొదలుపెట్టారు. యాత్ర జిల్లెలగూడ లలితానగర్ చౌరస్తా వద్దకు చేరుకోగానే భట్టివిక్రమార్క, ప్రజా గాయకుడు గద్దర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి కార్యకర్తలు భారీ గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం పాదయాత్ర మీర్‌పేట చౌరస్తా మీదుగా బడంగ్‌పేటకు చేరుకుంది. ప్రజా గాయకుడు గద్దర్ మాట.. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. యాత్రలో నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, చిగురింత పారిజాత, కార్పొరేటర్లు చల్లా కవిత, సిద్దాల మౌనిక, మీర్‌పేట అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు కృష్ణ, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, నిమ్మల వెంకటేశ్‌గౌడ్, జి.రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవయవ దానం చేద్దాం

- సన్‌రైజర్స్ క్రికెటర్ల ప్రతిజ్ఞ

సాక్షి, సిటీబ్యూరో: ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతున్న రోగులకు కొత్త జీవితాన్ని అందించే బృహత్తర కార్యక్రమం అవయవ దానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సన్‌రైజర్స్ జట్టు సభ్యులు ముత్తయ్య మురళీధరన్, డేల్ స్టెయిన్, ఉమ్రాన్ మాలిక్, హెన్రిచ్ క్లాసెన్ ప్రతిజ్ఞ చేశారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో తెలంగాణ జీవన్‌దాన్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో కలిసి 'రైజ్ ఎగైన్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ బాబు మాట్లాడుతూ.. ప్రస్తుతం కాలేయం, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు, ప్యాంక్రియాస్ వైఫల్యాల చికిత్సకు అవయవ మార్పిడి ప్రామాణికంగా మారిందన్నారు. దేశంలో నాలుగు లక్షలకు పైగా అవయవ మార్పిడులు చేయాల్సిన అవసరం ఉండగా.. సుమారు 15 వేల మార్పిడులు మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో సన్‌రైజర్స్ క్రీడాకారులు అవగాహన కల్పించడానికి ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో జీవన్‌ధాన్ సీఈఓ డాక్టర్ స్వర్ణలత, అపోలో హాస్పిటల్స్ సీఈఓ వి.తేజేస్వీ రావు, కార్డియోథొరాసిక్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ పి.వి. నరేష్ కుమార్, రెనాల్ ట్రాన్స్‌ప్లాంట్ డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ ఆనంద్ రామమూర్తి, డాక్టర్ ఎల్ శశిధర్ రెడ్డితో పాటు అవయవ గ్రహీతలు, వలంటీర్లు అవయవ దానానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

అకాలం.. తగ్గిన కాలుష్యం

- ఏప్రిల్‌లో గాలి నాణ్యతలో మెరుగుదల
- ఐదు రోజులకే పరిమితమైన కాలుష్యం
- అదే 2021 ఏప్రిల్‌లో 14 రోజుల పాటు
- 2022 ఏప్రిల్‌లో 16 రోజులు పొల్యూషన్



సాక్షి, సిటీబ్యూరో: అకాల వర్షాలతో వాయు కాలుష్యం తగ్గింది. ఒకవైపు వానలతో నగర వాసులకు అసౌకర్యం కలిగినప్పటికీ మరోవైపు పీల్చే గాలి మాత్రం పరిశుభ్రంగా మారింది. వరుసగా గత రెండేళ్లలోని ఏప్రిల్ నెలతో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్‌లో గాలి కాలుష్యం తగ్గిందని కేంద్ర కాలుష్య నియంత్రణ సంస్థ (సీపీసీబీ) గణాంకాలు వెల్లడించాయి. సీపీసీబీ లెక్కల ప్రకారం నగరంలో గాలి నాణ్యత సూచి (ఏక్యూఐ) గత నెలలో కేవలం అయిదు రోజులు మాత్రమే మితమైన కాలుష్య రోజులుగా ఉన్నాయి. అదే గతేడాది ఏప్రిల్‌లో చూస్తే ఏక్యూఐ 16 రోజులు, 2021 ఏప్రిల్‌లో 14 రోజులుగా ఉన్నాయి.

- 2021 ఏప్రిల్‌లో లాక్‌డౌన్ అమలులో ఉంది. ఫలితంగా నగర రోడ్లపై ప్రయాణ ఆంక్షల నేపథ్యంలో వాహనాల రాకపోకలు గణనీయంగా తగ్గాయి. దీంతో గాలి నాణ్యతలో స్వల్ప మెరుగుదలకు దారి తీసింది. ప్రస్తుతం నగరంలో ఎలాంటి ప్రయాణ ఆంక్షలు లేకపోయినప్పటికీ గత రెండేళ్లతో పోలిస్తే ఏక్యూఐ మెరుగ్గా ఉండటం గమనార్హం. దీనికి ప్రధాన కారణం అకాల వర్షాలే. గతంలో ఏ నెలలో లేనంత రీతిలో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎక్కువ రోజులు వర్షాలు కురిశాయి.

ఖైరతాబాద్, నాచారం, ఉప్పల్..

నాచారం, మలక్‌పేట, ఖైరతాబాద్, కొంపల్లి, సనత్‌నగర్ సహా చాలా ప్రాంతాలలో వాయు కాలుష్య స్థాయిలో సంతృప్తికరంగా లేదా 100 కంటే తక్కువగా నమోదవటంతో నగరమంతటా గాలి నాణ్యతలో మెరుగుదల స్పష్టంగా కనిపించాయి. పొగమంచు ప్రాంతాలైన ఉప్పల్, ప్యారడైజ్, అబిడ్స్ వంటి ప్రాంతాల్లోనూ ప్రజలు మంచి గాలిని పీల్చుకున్నారు.

ఏప్రిల్ 26న అత్యల్ప కాలుష్యం..

వర్షాల కారణంగా సాధారణ వాయు కాలుష్య కారకాలు, పుప్పొడి రేణువులు కరిగిపోయాయని ఓ సీనియర్ పర్యావరణ శాస్త్రవేత్త అభిప్రాయపడ్డారు. దీంతో గాలి నాణ్యతలో గణనీయమైన మెరుగుదల నమోదయింది. అలాగే వర్షాల రోజులలో వాహనాల రాకపోకలు కూడా తగ్గాయి. దీంతో వాహన కాలుష్యం కూడా తగ్గింది. ఈ ఏడాది ఏప్రిల్ 26 అత్యల్ప కాలుష్య దినంగా నిలిచింది. ఈ రోజున ఏక్యూఐ కేవలం 55గా నమోదయింది. సున్నా నుంచి 50 మధ్య ఉన్న ఏక్యూఐ మంచిదిగా, 51 నుంచి 100గా ఉంటే సంతృప్తికరంగా, ఏక్యూఐ 100 దాటితే మితమైన, తీవ్రమైన, వెరీ పూర్‌గా పరిగణిస్తుంటారు.

పల్లెల్లో క్రీడా సంబరం

- ఈనెల 15 నుంచి చీఫ్ మినిస్టర్ కప్
- మండలం నుంచి రాష్ట్రస్థాయి వరకు పోటీలు
- 15 నుంచి 36 వయస్సు వారు అర్హులు
- పంచాయతీల్లో ప్రారంభమైన పేర్ల నమోదు ప్రక్రియ
- క్రీడల నిర్వహణకు ప్రత్యేక కమిటీలు

షాద్‌నగర్: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. యువతీ యువకులను క్రీడల్లో ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 15 నుంచి పల్లెల్లో చీఫ్ మినిస్టర్ కప్– 2023 పేరిట క్రీడా సంబురాలను నిర్వహిస్తోంది. క్రీడల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది.

- మండల స్థాయిలో జరిగే పోటీల చైర్మన్‌గా ఎంపీపీ, కన్వీనర్‌గా ఎంపీడీఓ, సభ్యులుగా జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంఈఓ లేదా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు, ఎస్సై, మున్సిపల్ కమిషనర్, పీఈటీ వ్యవహరించనున్నారు.
- జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. వైస్ చైర్మన్‌గా ఐపీఎస్ అధికారి, కన్వీనర్‌గా జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి, సభ్యులుగా ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, డీఈఓ, ఇండస్ట్రీస్ మేనేజర్, మున్సిపల్ కమిషనర్‌లు వ్యవహరిస్తారు.
- రాష్ట్రస్థాయిలో క్రీడల శాఖ మంత్రి చైర్మన్‌గా, శాట్స్ చైర్మన్ కో చైర్మన్‌గా, ప్రిన్సిపల్ సెక్రటరీ వైస్ చైర్మన్‌గా, శాట్స్ ఎండీ కన్వీనర్‌గా, తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, కమిషనర్ మున్సిపల్, పంచాయతీరాజ్ కమిషనర్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ డైరెక్టర్లు సభ్యులుగా వ్యవహరిస్తారు. పోటీల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోంది.



పోటీలు ఇవే..

100 మీటర్ల పరుగు పందెం, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్ బాల్, స్విమ్మింగ్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్ పోటీలను పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించనున్నారు. మండల స్థాయి క్రీడల్లో పోటీ చేసేవారు గ్రామ పంచాయతీల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. మండల స్థాయిలో గెలిచిన వారిని జిల్లాస్థాయికి, జిల్లా స్థాయిలో గెలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. 15 నుంచి 36 ఏళ్ల వయస్సు వారు అర్హులు. మండల స్థాయిలో ఈనెల 15 నుంచి 17 వరకు, జిల్లా స్థాయి పోటీలు 20 నుంచి 22 వరకు, రాష్ట్రస్థాయి పోటీలు 24న జరుగనున్నాయి.

విజేతలకు నగదు బహుమతులు

రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు ఇవ్వనున్నారు. వ్యక్తిగత విభాగంలో మొదటి స్థానం సాధించిన వారికి రూ.20వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.10వేలు ఇవ్వనున్నారు. టీం విభాగంలో మొదటి స్థానం సాధిస్తే రూ.లక్ష, ద్వితీయ స్థానం వారికి రూ.75వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.50వేలు ఇవ్వనున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే..



గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారు. వారిలో ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం చీఫ్ మినిస్టర్ కప్ పేరుతో పోటీలు నిర్వహిస్తోంది.

– వినయ్‌కుమార్, ఎంపీడీఓ, ఫరూఖ్‌నగర్

క్రీడాకారులు సత్తా చాటాలి



క్రీడాకారులను మరింత ప్రోత్సహిస్తూ క్రీడా పండుగకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. క్రీడల నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేసింది. క్రీడాకారులు క్రీడల్లో రాణించి సత్తా చాటాలి.

– శంకర్ రాథోడ్, ఎంఈఓ, షాద్‌నగర్

ఏబీవీపీ నేతల అరెస్టు

ఇబ్రహీంపట్నం: గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల బస్సులను మంగల్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆపి, ట్రాఫిక్ జామ్ చేయడమేగాక పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన నలుగురు ఏబీవీపీ నేతలను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం. గురునానక్ కళాశాల బస్సులను మంగళ్‌పల్లి వద్ద నిలిపి విద్యార్థులను బలవంతంగా కిందకు దింపారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ఏబీవీపీకి చెందిన శ్రీకాంత్, సాయిచరణ్, శివకృష్ణ, సందీప్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

గొర్రెలను అపహరిస్తున్న దొంగల ముఠా అరెస్టు

- 48 గొర్రెలు, మేకలు, కారు, స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కారు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు, చిత్రంలో గొర్రెలు అపహరించిన దొంగలు

ఇబ్రహీంపట్నం రూరల్: గొర్రెలను, మేకలను అపహరిస్తున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలను సీఐ రవికుమార్ వెల్లడించారు. వండర్‌లా సమీపంలో ఉన్న కారులో అనుమానాస్పదంగా ఉన్న వారిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పారన్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారన్నారు. షేక్ ఇక్బాల్ (26), షేక్ జాఫర్ (26), సయ్యద్ అమ్మద్(33), మహమ్మద్‌గౌస్(23), షేక్‌అమీర్(20)లు బాలాపూర్‌కు చెందిన వారన్నారు. ఆటో డ్రైవర్లుగా పని చేస్తుంటారని, రాత్రి వేళల్లో గొర్రెలను, మేకలను అపహరిస్తుంటారని చెప్పారు. అలాగే పార్కింగ్ చేసిన కార్లు, లారీల నుంచి డీజిల్ దొంగతనం చేస్తున్నారని తెలిపారు. ఆటవీ ప్రాంతాల్లో, గ్రామాల శివారులో గొర్రెలు, మేకల మందల వద్ద మాటువేసి వాటిని అపహరిస్తున్నట్లు చెప్పారు. సుమారు ఏడెనిమిది గొర్రెలను, మేకలను కారులో తీసుకెళ్లి విక్రయించే వారని, ఆదిబట్ల, అబ్దుల్లాపూర్‌మేట్, పహాడీషరీఫ్, కందుకూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలుమార్లు దొంగతనాలకు పాల్పడినట్లు చెప్పారు.

రూ. 2.5లక్షల నగదు..

దొంగల నుంచి 48 గొర్రెలు, మేకలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4.50 లక్షలు ఉంటుందని తెలిపారు. రూ.2.5 లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ఇండికా కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

10 కేసుల్లో నిందితులు

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే అనేక మార్లు దొంగతనాలకు పాల్పడ్డారు. ఉప్పల్, ఆదిబట్ల, అబ్దుల్లాపూర్‌మెట్, పహాడీషరీఫ్, కొత్తూర్ పోలీస్‌స్టేషన్లలో వీరిపై 10 కేసులున్నాయి.. ఐదుగురు నిందితుల్లో షేక్ అమీర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు చెప్పారు.

పోలీసులకు రివార్డు

దొంగలను చాకచక్యం పట్టుకొని సొత్తు రికవరీ చేసినందుకు ఆదిబట్ల ఎస్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుల్ గిరి, కానిస్టేబుల్ ప్రసాద్, శివ చంద్ర, ఉపేందర్‌రెడ్డి, వెంకన్నలకు రివార్డులు అందజేశారు. వారి సేవలను గుర్తించి అభినందించారు.

భర్త వేధింపులు తాళలేక..

మహిళ ఆత్మహత్య

మొయినాబాద్: భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా పరిగి మండలం లక్నాపూర్ కు చెందిన సుజాత(40) బషీరాబాద్ మండలం పర్వత్‌పల్లికి చెందిన అల్లాపురం నర్సింహారెడ్డికి ఇచ్చి 2002లో వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు. కొంత కాలం బాగానే ఉన్నా భర్త సుజాతను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. నాలుగు నెలల క్రితం మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్‌కు వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నారు. భర్త వేధింపులు ఎక్కువకావడంతో సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి తండ్రి కృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి

ఎమ్మెల్యే కాలె యాదయ్య

- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

మొయినాబాద్‌రూరల్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఆడపడుచులకు అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 59 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు కేసీఆర్ పెద్దదిక్కుగా, అన్నగా నిలుస్తున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు శోభ, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీపీ నక్షత్రం జేవంతు, ఎంపీడీఓ సంధ్య, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఎంపీవో వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ బట్టు మల్లేశ్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడటం తగదు

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



జూనియర్ కార్యదర్శులకు మద్దతుగా సమ్మెలో పాల్గొన్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల: పంచాయతీ జూనియర్ కార్యదర్శులు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరితే, ప్రభుత్వం వారిని బెదిరింపులకు పాల్పడటం సరికాదని బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలో సమ్మె చేస్తున్న కార్యదర్శులకు మంగళవారం బీజేపీ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం వచ్చిన తర్వాత బతుకులు మారుతాయని నమ్మించిన కేసీఆర్.. అధికారంలోకి వచ్చాక మోసం చేస్తున్నారని విమర్శించారు. న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. జూనియర్ కార్యదర్శులకు రెగ్యులర్ చేయకపోతే బీజేపీ అండగా ఉంటుందని చెప్పారు. ఆయన వెంట బీజేపీ మండల కార్యదర్శి అనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భరోసా కల్పించిన యూత్ డిక్లరేషన్

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: నిరుద్యోగ యువతకు అండగా కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌పై నిరుద్యోగ యువత, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడ్తాల్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్‌తో కలసి ఆయన విలేరులతో మాట్లాడారు. యూత్ డిక్లరేషన్‌లో భాగంగా నిరుద్యోగ రహిత తెలంగాణ కోసం సెంట్రలైజ్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్, ప్రైవేట్ కంపెనీల్లో తెలంగాణలోని స్థానిక యువతకు 75 శాతం రిజర్వేషన్, యువత కోసం యూత్ కమిషన్, రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, గల్ఫ్ ఏజెంట్ల నియంత్రణ కోసం ప్రత్యేక గల్ఫ్ విభాగం ఏర్పాటు, టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇంటిగ్రేటెడ్ వర్సిటీలుగా పాలమూరు, శాతవాహన, మహాత్మాగాంధీ యూనివర్సిటీలను తీర్చి దిద్దడం, వర్సిటీలు లేని జిల్లాలో ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీలు ఏర్పాటు, బాసర తరహా మరో నాలుగు ట్రిపుల్‌ఐటీలు, పోలీసులు, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల కోసం వరంగల్, హైదరాబాద్‌లలో రెండు యూనివర్సిటీల ఏర్పాటు, 18 సంవత్సరాలు పైబడిన యువతులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటర్లు తదితర హామీలు డిక్లరేషన్‌లో ఉన్నాయని ఆయన వివరించారు. అలాగే.. ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాల భర్తీ, అమరుల కుటుంబాలకు నెలకు రూ.25 వేల పింఛన్ అందజేయనున్నట్లు తెలిపారు. హామీలు ఇవ్వడమే కాకుండా, అమలు విషయంలో జవాబుదారీగా ఉంటామని చెప్పడంతో యావత్ తెలంగాణ యువత, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి, గెలిపించాలని కోరారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు రాంచందర్‌నాయక్, హీరాసింగ్, బానుకిరణ్, లక్ష్మయ్య, రామకృష్ణ, రాజేశ్, సత్యంయాదవ్, రాజేందర్, భరత్, శ్రీకాంత్, టిల్లు ఉన్నారు.

భార్య, బిడ్డలకు జాగ్రత్త అని చెప్పి.. అంతలోనే..

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



శివలింగం మృతదేహం

యాచారం: భార్యను, ఇద్దరు పిల్లలను వాహనంలో ఎక్కించాడు.. జాగ్రత్తలు చెప్పాడు.. మీ వెనుకాలే వస్తున్నా అంటూ బైక్‌పై బయలుదేరాడు. అంతలోనే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. యాచారం మండల కేంద్రానికి చెందిన డి శివలింగం(35) మంగళవారం భార్య, పిల్లలతో కలిసి నగరంలో ఓ వివాహానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో రాత్రి వేళ భార్య పావనిని, ఇద్దరి కూతుళ్లను సాగర్ రింగు రోడ్డు వద్ద వేరే వాహనంలో ఎక్కించి వెనుకాలే బైక్‌పై యాచారం వైపు వస్తున్నాడు. గునుగల్ అటవీ ప్రాంతంలో రాత్రి 8 గంటల సమయంలో శివలింగం నడిపే బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివలింగం తలకు తీవ్ర గాయమైంది. అక్కడికక్కడే మృతి చెందాడు. జాగ్రత్త అని చెప్పి వెనుకనే వస్తున్న అని చెప్పి వెళ్లిపోయావా అంటూ భార్య రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. శివలింగం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగయ్య తెలిపారు.

పెళ్లి సంబంధాల పేరిట సైబర్ వల

వృద్ధుడి నుంచి రూ.26 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: కుమార్తెల పెళ్లిళ్ల కోసం వెబ్‌సైట్‌లో పోస్టు పెట్టిన ఓ వృద్ధ తండ్రిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. వివరాల్లోకి వెళ్తే..నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారి వివాహం చేసేందుకు ఇటీవల వారి సామాజికవర్గానికి చెందిన ఓ వెబ్‌సైట్లో ఇద్దరి అమ్మాయిల వివరాలను పోస్ట్ చేశారు. ఓ వ్యక్తి పెద్ద కుమార్తె నచ్చిందని మాట కలిపాడు. మరుసటి రోజు మీ చిన్న కుమార్తెను మా పెద్దన్నయ్య కొడుకుకి ఇస్తారా? ఒకటే చోట ఇద్దరూ కలసి ఉంటారంటూ నమ్మించారు. ఎట్టకేలకు ఒకటేసారి ఒకే కుటుంబానికి చెందిన వారి పెళ్లి సంబంధం రావడంతో ఆ తండ్రి ఎంతో సంతోషించాడు. వారం రోజుల పాటు ఇరువైపులా కేవలం ఫోన్‌ల ద్వారానే మాటలు సాగాయి. ముందుగా సంప్రదించిన వ్యక్తి తన కుమారుడు అర్జెంటుగా యూఎస్‌కు వెళ్లాలి, త్వరగా పెళ్లి చేద్దామనే ప్రపోజల్ పెట్టాడు. ఇద్దరి అమ్మాయిలకు సంబంధించి ముందుగానే నిశ్చితార్థం పెట్టుకుందామని డబ్బు కావాలని కోరాడు. అతగాడి మాటలు నమ్మిన ఆ తండ్రి పలు దఫాలుగా రూ.26 లక్షలు ముట్టచెప్పారు. అడిగినంత ఇస్తూనే ఉన్నాడు కానీ..పెళ్లి చూపులకు ఇంటికి మాత్రం రావడం లేదు. వారి సామాజిక వర్గానికి చెందిన వెబ్‌సైట్‌లో ఎంక్వైరీ చేయగా.. మీరు చెప్పిన వివరాలతో మా వెబ్‌సైట్‌లో ఎవరూ లేరనే విషయాన్ని చెప్పడంతో ఒక్కసారిగా గుండె ఆగినంత పనైంది. తన ఇద్దరి కుమార్తెల భవిష్యత్‌ను కాపాడాలని, దోచుకున్న డబ్బును ఇప్పించాలంటూ ఆ వృద్ధుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంగళవారం సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్ చెప్పారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

కేశంపేట: ఎక్లాస్‌ఖాన్‌పేటలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మంగళవారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, లక్ష్మమ్మ, రవీందర్‌యాదవ్ కవిత, మురళీకృష్ణ యాదవ్, హిమబిందు దంపతుల ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. బ్రహ్మోత్సవాలు తిలకించేందుకు నాయకులు, భక్తులు భారీగా హాజయ్యారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో రాజవరప్రసాద్, శ్రావణ్‌రెడ్డి, నర్సింగ్‌రావు, తలసాని వెంకట్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, జమాల్‌ఖాన్, యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కుటుంబ సభ్యులు

మహేశ్వరం సీఐకి రివార్డు

అభినందించిన రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్



సీఐ మధుసూదన్‌కు రివార్డు అందిస్తున్న రాచకొండ పోలీస్ కమిషనర్ తదితరులు

మహేశ్వరం: నేరాలకు సంబంధించిన కేసులను త్వరితగతిన ఛేదించినందుకు సీఐ మధుసూదన్‌తోపాటు క్రైమ్ కానిస్టేబుళ్లను రాచకొండ పోలీస్ కమిషనర్ డీ.ఎస్.చౌహాన్ రివార్డులను అందచేసి అభినందించారు. మంగళవారం రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసులకు రివార్డులు అందజేశారు. ఈ ఏడాది మార్చి నెలలో మండల పరిధిలోని కోళ్లపడకల్‌లో పొలం వద్ద ఉన్న మహిళ మెడలోంచి చైన్ స్నాచింగ్ జరిగింది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని 24 గంటల్లో ఛేదించి దొంగను పట్టుకున్నారు. మే నెలలో వ్యవసాయ పొలాలు, ఇంటి ముందు ఉన్న ట్రాక్టర్ల నాగళ్లు, గుంటుకలను దొంగిలించిన కేసుతో పాటు దుబ్బచర్ల గ్రామం పశు ఆస్పత్రి కంపౌడర్ మెడలోంచి పుస్తెల తాడు ఎత్తికెళ్లిన దొంగలను 72 గంటల్లో పట్టుకొన్నారు. ఈ కేసులతో పాటు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇతర నేరాలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించినందుకు సీఐ మధుసూదన్‌తో పాటు క్రైం టీంను రాచకొండ సీపీ అభినందించి రివార్డులను ప్రకటించారు. కార్యక్రమంలో రాచకొండ జాయింట్ సీపీ సత్యనారాయణ, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసై..

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ అంజయ్య, సీఐ మధుసూదన్

మహేశ్వరం: చెడు వ్యసనాలకు బానిసై మహిళల మెడల్లోంచి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరి దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి బంగారు గొలుసు, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం ఏసీపీ అంజయ్య కేసు వివరాలను వెల్లడించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన తెప్ప శివకుమార్, ఒలుగుమున్ను గజేంద్రలు నగరంలోని బీఎన్‌రెడ్డి నగర్ లో ఉంటూ సెంట్రింగ్ పని చేస్తున్నారు. ఇద్దరు చెడు వ్యసనాలకు అలవాటుపడ్డారు. దీంతో డబ్బుల కోసం చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఈ నెల 4న దుబ్బచర్ల ప్రభుత్వ పశు ఆస్పత్రిలో కంపౌండర్‌గా విధులు నిర్వహిస్తున్న మహిళ మెడలో బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేసుకుని విచారణ చేపట్టారు. మన్సాన్‌పల్లి చౌరస్తాలో పోలీసులు వాహనాలు తనిఖీ చేపడుతుండగా అనుమానాస్పదంగా ఉన్న వీరిద్దరిని పట్టుకుని విచారించగా దొంగతనం చేశామని ఒప్పుకున్నారు. వీరిపై పలు దొంగనం కేసులు సైతం ఉన్నాయి. బంగారు గొలుసు, వారి వద్ద ఉన్న పల్సార్ బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని ఇద్దరి నిందితులను రిమాండ్‌కు తరలించారు.